క్లుప్తంగా

హైస్కూల్‌లో భవిత కేంద్రం విలీనం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత కేంద్రాన్ని కొండపాలెం ఉన్నత పాఠశా లలో విలీనం చేసినట్టు ఎంఈఓలు పి.రామారావు,డి.అప్పన్న గురువారం తెలిపారు. సమ్మిళిత విద్యలో భాగంగా ఉన్నతా ధికారుల ఆదేశాలతో భవిత కేంద్రాన్ని కొండపాలెం పాఠశాలకు తరలించామని పేర్కొన్నారు. భవిత కేంద్రంలో ఇదివరకుఅందిన సేవలన్నీ ఇకపై నుంచి కొండపాలెం పాఠశాలలో అందిస్తామని, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు గమ నించాలని కోరారు.

15 నుంచి సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం

దత్తిరాజేరు: మండలంలో ఈనెల 15 నుంచి సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో ఉన్న తాగు నీటి హ్యాండ్ బోరులకు మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

సిరిమాను చెట్టుకు పూజలు



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు

గంట్యాడ: మండల కేంద్రంలో త్వరలో నిర్వహించనున్న ఎల్లమాంబ సిరిమానోత్సవం కోసం గొడియాడ గ్రామంలోని చప్ప రామకృష్ణ తోటలో సిరిమాను చెట్టును గుర్తించారు. ఈచెట్టుకు గంట్యాడ, గొడియాడ గ్రామ పెద్దలు, భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. సిరిమాను చెట్టుకు గొడ్డలితో మూడు వేట్లు వేశారు. సర్పంచ్ వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



షిర్డీ సాయిబాబాకు పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త రమణరాజు

మెరకముడిదాం: సోమలింగాపురం గ్రామంలో శేషసాయి ఆలయ వార్షికోత్సవాన్ని ఆలయ ధర్మకర్త ఎస్.వి.రమణ రాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. షిర్డీసాయి బాబాకు ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి కృష్ణ శాస్త్రి, ఆరవెల్లి శ్రీనివాసశాస్త్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

జాతీయ మహిళా దినోత్సవం



సరోజిని నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

శృంగవరపుకోట: నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజిని నాయుడు జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ నేతృత్వంలో గురువారం జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. సరోజిని నాయుడు చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు, అధ్యాపకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సరోజిని నాయుడు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని,1925లో భారతీయ జాతీయ కాంగ్రెస్ తొలి మహిళా అధ్యక్షురాలుగా సేవలందించారన్నారు. ఆంగ్లంలో పలు రచనలు చేశారని, స్త్రీజనోద్ధరణకు పనిచేసిన అభ్యుదయవాదిగా చరిత్రలో నిలిచారన్నారు.

వేపాడలో నేత్ర వైద్యశిబిరం



వృద్ధురాలికి నేత్రపరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ వసుంధర

వేపాడ: శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ వసుంధర శిబిరంలో 48 మందికి కంటిపరీక్షలు చేసి 21మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వీరిని బస్సులో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించి ఉచితంగా ఆపరేషన్ చేయించి, కళ్లద్దాలు అందజేయనున్నామని శిబిరం సమన్వయకర్త జోగారావు తెలిపారు.

భారీగా పెరిగిన చార్జీలు తగ్గిన రిజిస్ట్రేషన్‌లు

- భూరిజిస్ట్రేషన్ ఫీజులను భారీగా పెంచేసిన కూటమి ప్రభుత్వం
- ఒకే సారి 10 నుంచి 20 శాతం ఫీజుల పెంపు
- నిలిచిన భూక్రయ, విక్రయాలు, తగ్గిన రిజిస్ట్రేషన్‌లు



గజపతినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

బొండపల్లి:

రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రోజుకో రంగం పతనమవు తోంది. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీల అమలులో విఫలమైనప్పటికీ...ప్రజలపై బాదుడే బాదు డు కార్యక్రమం మాత్రం పక్కాగా అమలు చేస్తున్నారు. మోయలేని భారాలను ప్రజల నెత్తిన మోపుతున్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను రూపా యి కూడా పెంచబోమని చెప్పారు. కానీ ఇప్పటికే రెండు దఫాల్లో భారీగా చార్జీలు పెంచేశారు. నిత్యావసర సరకు ల ధరల పెరుగుదలకైతే అడ్డూ అదుపు లేకుండా పోతోంది. తాజాగా భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచేశారు. గతంలో ఉన్న రిజిస్ట్రే షన్ చార్జీలపై ఒక్కసారిగా 10 నుంచి 25 శాతం వరకు పెంచాలని జనవరి నెలలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా....ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలుకు శ్రీకారం చుట్టింది. అన్నిరకాల భూము ల రిజిస్ట్రేషన్‌లతో పాటు భవన నిర్మాణ స్థలాల రిజిస్ట్రేషన్ చార్జీలను భారీగా పెంచడంతో దీని ప్రభావం భూముల క్రయవిక్రయాలతో పాటు భవన నిర్మాణ రంగంపై తీవ్రంగా పడుతోంది. ఇప్పటికే భారాలు మోస్తున్న ప్రజలు ప్రభుత్వ తాజా నిర్ణయంతో భూములు విక్రయించేందుకు, కొనుగోలు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. గజపతినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని గజపతినగరం, మెంటాడ,బొండపల్లి,దత్తిరాజేరు మండలాల్లో సుమారు 26 వేల హెక్టార్ల సాగు భూమితో పాటు 1,000 హెక్టార్లలో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఉన్నాయి.

మూడు కేటగిరీల్లో పెరిగిన చార్జీలు

మూడు కేటగిరిల్లో భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచారు. జాతీయ రహదారులతో పాటు ఆర్అండ్‌బీ రోడ్లకు అనుకుని ఉన్న భూములకు సంబంధించి గతంలో ఉన్న10 శాతం విలువ రిజిస్ట్రేషన్ చార్జీలను 25 శాతాని పెంచారు. అలాగే రిజార్వాయర్‌లు, సాగునీటి ప్రాజెక్టుల క్రింద సాగవుతున్న భూములకు సంబంధించి 10 శాతంగా ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజును సాగునీటి లభ్యత, అక్కడి భూముల విలువ ఆధారంగా ఒకేసారి 10 నుంచి 20 శాతానికి పెంచేశారు. మిగ తా సాగు భూములకు సంబంధించి 2023 వరకు 5 శాతం ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజును అప్ప టి ప్రభుత్వం 5 శాతం పెంచి 10శాతం చేసింది. దీనిపై కూటమి ప్రభుత్వం ఏకంగా మరో 10శాతం పెంచి 20 శాతం చేసేసింది.

తగ్గిన రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచుతూ తీసుకున్న నిర్ణయం వల్ల భారీగా క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. నిత్యం క్రయ,విక్రయదారులతో కళకళలాడే గజపతినగరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇప్పుడు కళ తప్పింది. ఫీజులు పెంచక ముందు వరకు ఒక్కో నెలలో సగటున 667 రిజిస్ట్రేషన్‌లు జరిగేవి. పెంచిన ఫీజులు ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి వచ్చాయి. నాటి నుంచి ఇప్పటి వరకు 190 రిజిస్ట్రేషన్లే జరిగాయి. అది కూడా గతంలో ఆన్‌లైన్‌లో ఎక్కడైనా రిజిస్ట్రేషన్లు చేయిం చుకోవడానికి వెసులుబాటు కల్పించడం వల్ల జరిగినవే.

నిబంధనలకు లోబడే రిజిస్ట్రేషన్‌లు

ప్రభుత్వం సూచించిన నిబంధనలకు లోబడే రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచి, అమలు చేస్తున్నాం. గజపతినగరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని అన్ని గ్రామా ల్లో సంబంధిత అధికారులు భూములను పరిశీలించి రిజిస్ట్రేషన్ల చార్జీల పెంపునకు సంబంధించి ఓ నివేదిక ఇచ్చారు. వారితో పాటు తాను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాంకేతికపరంగా ప్రభుత్వం సూచించిన నిబంధనల మేరకే చార్జీలను పెంచాం. ఈ నివేదికను జిల్లా జాయింట్ కలెక్టర్‌కు అందజేశాం. ఎక్కడా నిబంధనలను అతిక్రమించి ఫీజులు పెంచలేదు.

– ఎస్.తవిటయ్య, గజపతినగరం సబ్ రిజిస్ట్రార్

తక్షణమే తగ్గించాలి



పెంచిన రిజిస్ట్రేషన్ చార్జీలను ప్రభుత్వం తక్షణమే తగ్గించాలి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై మోయలేని భారాలు మోపుతున్నారు. గత అయిదేళ్లలో రిజిస్ట్రేషన్ ఫీజులను అప్పటి ప్రభుత్వం పెంచలేదు. ఇప్పుడు ఒకేసారి 10 నుంచి 20 శాతం వరకు ఫీజులు పెంచేయడం తగదు. ఫీజుల పెంపు వల్ల భూముల ధరలు తగ్గే అవకాశం ఉంది. అత్యవసరమై భూములు అమ్ముకునే రైతులు నష్టపోతారు. భవన నిర్మాణ రంగంపై కూడా ప్రభావం పడుతుంది.

– పురం అప్పారావు, గజపతినగరం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి

పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి



తమకు కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గరివిడి మండల ఈపీఎ ఫ్ పింఛన్‌దారులు గురువారం నిరసన తెలిపారు. గరివిడి ఈఎస్ఐ ఆస్పత్రి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. రూ.9 వేల పెన్ష న్‌తో పాటు రైలు ప్రయాణంలో రాయితీ, ఉచిత వైద్యం, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశా రు. ఆల్ పెన్షనర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.ఎస్.ఎన్.మూర్తి, ఉపాధ్యక్షుడు కంది రామారావు, కోశాధికారి ఏ.గౌరినాయుడు, సభ్యులు షేక్ సలీం,గంట్యాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

– చీపురుపల్లిరూరల్(గరివిడి)

ప్రకృతి సేద్యంపై శిక్షణ



ఎస్.కోట వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై డివిజన్ స్థాయిలో సచివాలయ వీఏఏలు, అయిదు మండలాల వ్యవసాయ సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ రైతులంతా పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంపై దృష్టిసారించేలా చూడాలని కోరారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, కషాయాలు, ఘన,ద్రవ జీవామృతాల తయారీ గురించి వివరించారు. జిల్లా వ్యవసాయాధికారి వి.టి.రామారావు భూఆధార్ గురించి వివరించి. రైతులంతా ఈనెల 25వ తేదీలోగా ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. బిందు,తుంపర సేద్యం పరికరాలు, వాటికి ప్రభుత్వం ఇచ్చే రాయితీల గురించి జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీనారాయణ వివరించారు. అనంతరం గోపాలపల్లి,ధర్మవరం రైతు సేవాకేంద్రాలను జిల్లా వ్యవసాయశాఖాధికారి సందర్శించి పార్మర్ రిజిస్ట్రేషన్‌పై ఆరాతీశారు. ఏడీ ఎల్.విజయ, ప్రకృతి సేద్యం పీడీ ఆనందరావు, అయిదు మండలాల ఏఓలు, పాల్గొన్నారు

.– శృంగవరపుకోట

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



కొండగంగుబూడి ఆశ్రమ పాఠశాలలో ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ నాయకులు



సోంపురం హైస్కూల్‌లో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

వేపాడ: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మండలంలో జోరుగా సాగుతోంది. పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడుకు మద్దతుగా పీఆర్టీయూ, ఏపీటీఎఫ్ నాయకులు కొండగంగుబూడి గిరిజన ఆశ్రమపాఠశాల, నీలకంఠరాజపురం, వావిలపా డు ఉన్నత పాఠశాలల్లో గురువారం ప్రచారం చేశారు. యూటీఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరి తరఫున బొద్దాం, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో యూటీఎఫ్ నాయకులు ప్రచారం నిర్వహించారు.

‘మాట వినవే మాలక్ష్మి’ పాట విడుదల



మాట వినవే మాలక్ష్మి పాట విడుదల చేస్తున్న శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: సామాజిక ఇతి వృత్తం నేపథ్యంగా పల్సర్ బైక్ రమణ రచించి, ఆలపించి, ఆర్.ఆర్ క్రియేషన్స్ బ్యానర్‌లో చిత్రీకరించిన ‘మాట వినవే మాలక్ష్మి’ అనే పాటను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు చీపురుపల్లిలోని తన నివాసం వద్ద గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన పల్సర్ బైక్ రమణ ప్రముఖ జానపద గాయకుడిగా పేరు సంపాదించారని, ఆయన ఎన్నో గేయాలు రచించి, ఆలపించిన సంగతి తెలిసిందేనన్నారు. ‘మాట వినవే మా లక్ష్మి’ పాట చాలా చక్కగా వచ్చిందని, కచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గవిడి సురేష్, కోరుకొండ దాలయ్య, ప్రభాత్, గణేశ్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు

- జిల్లాకు రెండో స్థానం ఎలా వచ్చింది
- అధికారులు వస్తే సమస్యలు చూపిస్తాం



పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు త్రినాథరావు

చీపురుపల్లి: కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదని రామలింగాపురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు ఆరోపించారు. చీపురుపల్లిలో గురువారం ఆయన విలేక రులతో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జిల్లాకు రెండో స్థానం వచ్చినట్లు ఓ ప్రధాన పత్రికలో(సాక్షి కాదు) ఇటీ వల కథనం ప్రచురితమైందన్నారు. భూసమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చిన అర్జీలలో చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో 93.23 శాతం పరిష్కరించినట్లు ఆ కథనంలో ఉందన్నారు. ఇదంతా కాగితాలకే పరిమితం తప్ప క్షేత్ర స్థాయిలో ఎ లాంటి సమస్యలూ పరిష్కారం కాలేదని స్పష్టం చేశారు. అలా కాదని అధికారులకు అనిపిస్తే సమస్యలతో సతమతమవుతు న్న ఎంతో మంది రైతులను తాను చూపిస్తానన్నారు. రెవెన్యూ సదస్సుల పేరుతో కాలక్షేపం చేశారే తప్ప రైతులకు ఎలాంటి మేలు జరగలేదని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాకు రెండో స్థానం ఎలా వచ్చిందో అర్థం కావడం లేదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయి యంత్రాంగం క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోకి వస్తే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు కనిపిస్తాయ న్నారు. అలా కాకుండా కాగితాల్లో చూపించిన పరిష్కారాలకు ర్యాంకులు ప్రకటించేసుకుని స్థానిక అధికారులు ఉన్నతాధికారు లను మోసం చేయడం ద్వారా రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.

ఎంఎస్‌పీలతో నేర నియంత్రణ..



ఎంఎస్‌పీలతో సమావేశమైన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఫైల్)

విజయనగరం క్రైమ్ :

నేర నియంత్రణకు ఎంఎస్‌పీల (మహిళా సంరక్షణ పోలీసులు) సహకారం తీసుకోవాలని ప్రస్తుత కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పోలీస్ పెద్దల ఆదేశాల మేరకు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఎంఎస్‌పీలతో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ఇటీవల సమావేశమయ్యారు. వాస్తవానికి ఎంఎస్‌పీ వ్యవస్థను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. పోలీస్ శాఖకు చేదోడు వాదోడుగా ఉంటూ నేరాల నియంత్రణకు సహకరించాలనే ఉద్దేశంతో ఈ మహిళా సంరక్షణ పోలీసుల వింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ వింగ్‌లో చేరిన వారు పోలీస్ వ్యవస్థకు ఎంతో సహకారం అందించారు. అయితే అనంతర కాలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. పాలనా పగ్గాలు చేపట్టి ఎనిమిది నెలలవుతున్నా ఎంఎస్‌పీల సంగతి పట్టించుకోలేదు. ఒకరకంగా చెప్పాలంటే మహిళా సంరక్షణ పోలీసులంతా వైఎస్సార్‌సీపీకి చెందిని వారేనన్న వ్యాఖ్యలు కూడా వినిపించాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమను ఎవ్వరూ పట్టించుకోవడం ఎంఎస్‌పీలు వాపోతున్నారు. ఈ తరుణంలో ఎంఎస్పీలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర హోం మంత్రిత్వ శాఖ ద్వారా రాష్ట్రంలో అన్ని జిల్లాల పోలీస్ బాస్‌లకు మౌఖికపరమైన ఆదేశాలు వచ్చినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఎంఎస్‌పీలతో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సమావేశమయ్యారు. ముమ్ముందు కూటమి ప్రభుత్వం ఎంఎస్పీలను ఏ విదంగా వినియోగించుకుంటుందో చూడాలి మరి.

లెప్రసీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీపీఎం దుర్గా ప్రసాద్, వైద్యసిబ్బంది

బొండపల్లి: జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గరుడుబిల్లి గ్రామంలో లెప్రసీపై వైద్య సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. డీపీఎం ఓ.దుర్గాప్రసాద్ మాట్లాడు తూ కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉంటే లెప్రసీ వ్యాధి కావచ్చని, అలస త్వం ప్రదర్శించకుండా పీహెచ్‌సీలో వైద్యసిబ్బందిని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. హెల్త్ సూపర్ వైజర్ ఎస్.ఏ.భాషా, బ్రెటర్ ఫ్యూచర్ ప్రతినిధి నాగభూషణం, ఎంఎల్‌హెచ్‌పీలు ఫ్రాంక్లిన్, హారిక, ఏఎన్ఎంలు అంజులమ్మ, రమణమ్మ,తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణరావు

గజపతినగరం: ప్రతి ఒక్కరికీ చట్టాలపై కనీస అవగాహన ఉండాలని ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పోక్సో తదితర చట్టాలు, రహదారి భద్రతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. ఎవరైనా లైగింక వేధింపులకు పాల్పడినా, అసభ్యంగా ప్రవర్తించినా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చెప్పాలని విద్యార్థినులకు సూచించారు. హెచ్ఎం చిప్పాడ రమేష్ కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ మహేష్, పోలీస్ సిబ్బంది

గజపతినగరం: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో బొండపల్లి ఎస్ఐ యు.మహేష్, పోలీస్ సిబ్బంది గురువా రం వాహన తనిఖీలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహన రికార్డులను పరిశీలించారు. గంజా యి, మత్తుపదార్థాలు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాహన తనిఖీలు చేస్తు న్నామని ఎస్ఐ చెప్పారు.

వ్యవసాయ అనుబంధ పనులు చేపట్టండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ శారదాదేవి



సమావేశానికి హాజరైన ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది

బొండపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో ఎక్కువగా వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన పనులు ఉండేలా చర్యలు తీసుకోవాలని డ్వామా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శారదాదేవి అధికారులకు సూచించారు. గజపతినగరం క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల ఉపాధి హామీ పథకం ఏపీఓలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లతో స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువా రం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో తప్పనిసరిగా ఫారం పాండ్‌లు, సోక్‌పిట్‌ల తవ్వకా లు, చేపల చెరువుల అభివృద్ధితో పాటు వ్యవసాయ, దాని అనుబంధ రంగాల పనులను గుర్తించి చేపట్టాలని సూచించారు. ప్రతీ గ్రామం పరిధిలో తప్పనిసరిగా అయిదుకు తక్కువ కాకుండా ఫారం పాండ్‌లు తవ్వించాలన్నారు. ఉపాధి వేతనదారులకు రోజు వారీ గరిష్ఠ వేతనం రూ.300 వచ్చేలా పనులు చేయించాలన్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున వేతనదారులు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు పనులు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. క్లస్టర్ ఏపీడీ కె.రమామణి, ఎంపీడీఓ జి.గిరిబాల, బొండపల్లి, గజపతినగరం ఏపీఓలు కె.రామారావు, బి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించండి

విజయనగరం అర్బన్: జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ వసతిగృహాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి.వి.జి శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. విజయనగరంలోని కమిషన్ చైర్మన్ క్యాంప్ ఆఫీస్‌లో చైర్మన్‌ను శ్రీనివాసరావు గురువారం కలిసి సమస్యలు విన్నవించారు. పట్టణంలోని పద్మావతినగరలో బాలుర వసతిగృహం, మహిళా ప్రాంగణంలోని వసతి గృహంతో పాటు రాజాంలోని బాలికల కళాశాల వసతిగృహంలో మరమ్మతులు చేపట్టాల్సి ఉందని చెర్మన్‌కు శ్రీనివాసరావు వివరించారు. దీనికి కమిషన్ చైర్మన్ స్పందిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.